

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో కౌంటర్

ప్రీపెయిడ్ ఆటోకు ఆదరణ కరువు!

- ప్రచారం లేక దరికి చేరని ప్రయాణికులు
- రోజుకు 5 ఆటోలైనా బుక్ కాని వైనం
- పాత రేట్లతో కష్టం అంటున్న ఆటో డ్రైవర్లు

గోపాలపట్నం:

ప్రయాణికుల భద్రత.. చార్జీల దోపిడీకి చెక్ పెట్టేలా సింహాచలం రైల్వే స్టేషన్‌లో అట్టహాసంగా ప్రారంభించిన ప్రీపెయిడ్ ఆటోలకు ఆదరణ కరువైంది. ప్రారంభించిన సమయంలో చేసిన ప్రచారం సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత లేక పోవడంతో ప్రయాణికులు సేవలను వినియోగించుకోలేకపోతున్నారు. దీంతో రోజుకు కనీసం 5 ఆటోలైనా బుక్ కావడం లేదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు.

నమోదు 16.. వస్తుంది ఆరుగురే

ఇక్కడి ప్రీపెయిడ్ ఆటో కౌంటర్‌లో 16 మంది ఆటో డ్రైవర్లు నమోదు చేసుకున్నారు. అయితే గిరాకీ లేక పోవడంతో ఇందులో 6 మంది కూడా అందుబాటులో ఉండడం లేదని తెలుస్తోంది. కొన్ని సార్లు రోజులో ఒక్క బుకింగ్ కూడా రాకపోవడంతో బతికేదెలా అని వాపోతున్నారు.

పాత ధరలతో...

ఆరేడేళ్ల కిందట ధరలు ఇప్పుడు అమలు చేయడం వల్ల గిట్టుబాటు కావడం లేదని ఆటోవాలాలు వాపోతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు చాలా పెరిగాయని.. రోజుకు రూ.300లైనా రావడం లేదని చెబుతున్నారు.అధికారులు ఆలోచించి ధరలు సవరించాలని కోరుతున్నారు.

ప్రచారం కరువు

రైలు ప్రయాణికులకు స్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో సౌకర్యం ఉందన్న విషయం తెలియదని వాపోతున్నారు. ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ అనే విధంగా బోర్డు ఏర్పాటు చేస్తే బాగుండేదని చెబుతున్నారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు 22.. పోయే 22 ట్రైన్లు ఆగుతాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు రోజుకు సుమారు 1800 ఉంటారు. సింహాచలం ఉత్సవాల సమయాలు, సెలవుల్లో భక్తుల తాకిడి ఉంటుంది. రాత్రి 3 గంటల నుంచి ట్రైన్లు వస్తుంటాయి. ప్రధానంగా ఆ సమయాల్లో వచ్చే ప్రయాణికులకు ఈ ఆటో సౌకర్యం ఎంతో భద్రతనిస్తుంది. అయితే ప్రీపెయిడ్ ఆటోలు ఉన్నాయని విషయం తెలియక పోవడంతో వారు ఆన్‌లైన్‌లో వాహనాలు బుక్ చేసుకుంటున్నారు. దీని వల్ల తమకు భేరం లేక పోగా.. ప్రయాణికులు అదనపు భారం మోయాల్సి వస్తుందని ఆటోవాలలు చెబుతున్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి

ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ సౌకర్యం ఉందని తెలిసే విధంగా ప్లాట్‌ఫారాలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని డ్రైవర్లు కోరుతున్నారు. ఈ కౌంటర్ ఉండే చోటును సూచించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ట్రైన్ వచ్చే సమయంలో, ప్రయాణికులు వేచి ఉండే సమయాల్లో ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ సౌకర్యం ఉందని.. ఉపయోగాలు తెలిపే విధంగా ప్రచారం చేయించాలని కోరుతున్నారు. స్త్రీ శక్తి పథకం వల్ల మహిళలు బస్సులపై మక్కువ చూపుతున్నారని వాపోతున్నారు.

ప్రీపెయిడ్ ఆటో సర్వీస్‌తో భద్రత

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రీపెయిడ్ సర్వీస్ పోలీసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం బాగుంది. ఈ సర్వీసుల వల్ల ప్రయాణికులకు భద్రత ఉంటుంది. ప్రధానంగా మహిళలు ఈ సర్వీసులను ఉపయోగించుకోవాలి. ప్రయాణికులకు తెలిసే విధంగా స్టేషన్ ఆవరణలో హోర్డింగ్‌లు పెట్టాలి.

–వెంకట రమణ, ప్రయాణికుడు,శ్రీకాకుళం,



స్టేషన్ ప్లాట్‌ఫాంపై కానరాని ఆటో స్టాండ్ ప్రచార బోర్డులు



సర్వీసు ధరలు పెంచాలి



పాతకాలం నాటి ధరలు పెట్టడం వల్ల మాకు గిట్టుబాటు కావడం లేదు. పెట్రోల్, డీజిల్ ఖర్చులైనా రాకపోతే జీవించేదెలా. రవాణా శాఖ అధికారులు ఈ ధరలు సవరణ చేయాలి. స్టేషన్‌లో ప్రచారం చేయాల్సి ఉంది. ప్రయాణికులకు ప్రీపెయిడ్ ఆటో సర్వీసు ఉందని తెలియజేయాలి. లేక పోతే మేము ఇబ్బంది పడతాం. – రామకృష్ణ, ఆటో డ్రైవర్

క్లుప్తంగా

ములగాడ రోడ్డు పనులు ప్రారంభం



పనులు చేపడుతున్న కార్మికులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే రోడ్డు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. శ్రావణి షిపింగ్ ప్రహరీ పక్క నుంచి రోడ్డు అభివృద్ధి పనులు సోమవారం చేపట్టారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో పోర్టు అధికారులు ఈ పనులను చేపడుతున్నారు. ములగాడ మార్గానికి మోక్షం కల్పించాలని వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పలు మార్లు పోర్టు అధికారులకు వినతులు అందజేశారు. దీనికి స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టడానికి అంగీకరించారు.దానిలో భాగంగా పనులు చేపడుతున్నారు.

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

మల్కాపురం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో నిర్వహించడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వద్ద పార్టీ వార్డు అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము) ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాయిపురెడ్డి అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ కార్యాలయం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ అతిథిగా పాల్గొనున్నారు. 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

గ్రీన్‌బెల్టుల అభివృద్ధికి శ్రీధర్ కృషి ప్రశంసనీయం



మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో జాతీయ రహదారికి సమీపంలో గ్రీన్ బెల్టుల అభివృద్ధికి మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చేసిన కృషి అభినందనీయమని అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక హెల్దీ వాకర్స్ అసోసియేషన్, స్త్రీ శక్తి హెల్దీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించి, ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. ఇటీవల జరిగిన శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేయించి, సర్వమత ప్రార్థనలు చేయించారు. శ్రీధర్ మాట్లాడుతూ వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయించామన్నారు. గ్రీన్ బెల్టుల అభివృద్ధి సంతృప్తినిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని వెంకటాపురం కంపరపాలెం, నందమూరినగర్‌లలో సోమవారం ప్రభుత్వ విప్ గణబాబు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపర ఆనంద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'స్త్రీ శక్తి'



సంప్రదాయ నృత్యాలు చేసిన చిన్నారులను అభినందిస్తున్న శ్రీభరత్, గణబాబు

గోపాలపట్నం: సూపర్‌సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని మహిళలకు అందించగలిగామని ఎంపీ శ్రీభరత్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డులో సోమవారం సాయంత్రం నిర్వహించిన స్త్రీశక్తి కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. పదో తరగతిలో గతేడాది మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, రమణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో అన్న సమారాధనలు



పైడిమాంబ కాలనీలో అన్నప్రసాదాలను వడ్డిస్తున్న నిర్వాహకులు



కొత్తపాలెంలో స్టీల్‌కంచాలతో పాల్గొన్న వారికి వస్త్ర సంచులు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం, కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లోని పలు వినాయక మండపాల వద్ద సోమవారం అన్నదానాలు చేశారు. జీవీఎంసీ 90వ వార్డు పైడిమాంబ కాలనీలో దేవి ఇమేజెస్ సంస్థ ప్రతినిధి గంటా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఎసెంట్ ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. శేఖర్, రమణమ్మ, పార్వతి, కుమారి, జ్యోతి, రాజా తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ కంచాలతో పాల్గొన్న వారికి వస్త్ర సంచులు

పర్యావరణ హితంగా అన్నదానాలు చేయాలని జేడీ ఫౌండేషన్ సభ్యులు కోరారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో అన్నపూర్ణ కేటరింగ్ ఆధ్వర్యంలో సంతోష్‌నగర్ వినాయక మండపంలో అన్నసమారాధన నిర్వహించారు. అక్కడికి వచ్చిన వారు ప్లాస్టిక్ ప్లేట్లలో కాకుండా ఇంటి నుంచి తెచ్చుకున్న స్టీల్ కంచాల్లో భోజనం చేశారు. అలా స్టీల్ కంచాలతో వచ్చిన వారికి జేడీ ఫౌండేషన్ సభ్యులు వస్త్ర సంచులు బహుమతిగా అందించారు.

52 వార్డు పాతకరాసలో..



పాత కరాసలో భక్తులకు పులిహోర వడ్డిస్తున్న జియ్యాని శ్రీధర్

వార్డు పరిధి పాత కరాసలోని శ్రీ బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయ కమిటీ కరాస రాక్ స్టార్ సభ్యులు వినాయక మండపం వద్ద నారాయణ సేవ నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని, అన్న ప్రసాదం వడ్డించారు. సుమారు 2500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. 52వ వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్, బేరి హరికృష్ణరెడ్డి, గిరిధర్ కుమార్, శ్రీదేవి వర్మ, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన పూజ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతుంది. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,116 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం 0891–2711725 లేదా 2566514 నంబర్లను సంప్రదించవచ్చు.

నేడు శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి డీజీఎం బంగార్రాజు సోమవారం తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఫౌండేషన్ జీఎం కె.రాధాకృష్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ ప్రారంభించారు. గత నెల 20 నుంచి 26 వరకు పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నస్రీన్, శిరీష, డీజీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

బాలోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

45 సాంస్కృతిక, విద్యాపరమైన అంశాల్లో పోటీలు



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు, నిర్వాహకులు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న బాలోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థుల కోసం 45 రకాల సాంస్కృతిక, అకడమిక్ ఈవెంట్‌లకు సంబంధించిన బుక్‌లెట్‌లు 120 పాఠశాలలకు చేరవేశామన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవం పోటీల్లో పాల్గొనేందుకు ఎన్ఏడీ కొత్త రోడ్, సింహాచలం, నరవ, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులను ఆహ్వానించామన్నారు. ఆయా పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 6 లోపు ఏ అంశాల్లో పాల్గొంటారో వివరంగా అందించాలని సూచించారు. ఇప్పటికే చాలా పాఠశాలల నుంచి సమాచారం వచ్చిందన్నారు. బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. బాలోత్సవం ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం





వినాయక ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలు

మల్కాపురం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలో అల్లరి యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గొల్లవీధి,గాంధీజీవీధి తదితర ప్రాంతాల మహిళలు పాల్గొని చక్కటి ముగ్గులు వేశారు. ఉరుకూటి రూపయాదవ్ మొదటి బహుమతి,ధర్మాల ఊర్వశి ద్వితీయ బహుమతి దక్కించుకున్నారు. కార్యవర్గ ప్రతినిధులు బొట్ట వెంకటప్పారావుయాదవ్ దాడి బాలకృష్ణ,నమ్మి శంకరరావుయాదవ్ బహుమతులు అందించారు. ఇదే వార్డు పరిధిలో యాదవ్ యూత్ ప్రతినిధుల ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద లక్ష దీపారాధన నిర్వహించారు. మహేష్‌యాదవ్ నూనెల పాల్గొన్నారు.

డ్రైవర్ల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం: వృత్తి కోసం కుటుంబానికి దూరంగా ఉంటున్నా లారీ డ్రైవర్లు అంకితభావంతో విధులు నిర్వర్తించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. వారు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని ఆకాంక్షించారు. డ్రైవర్స్‌డే సందర్భంగా స్థానిక ఐవోసీ వద్ద ఆంధ్ర మోటార్స్ ట్యాంక్ లారీ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఏపీ రాష్ట్ర డ్రైవర్స్ అసోసియేషన్ మహాసభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ ప్రయాణాలలో ప్రమాదాలు ఉన్నా, యజమాని చెప్పిన మాటకు కట్టుబడి డ్రైవర్లు పని చేయడం గొప్ప విషయమన్నారు. తమ కుటుంబాలను సంతోషంగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, రాష్ట్ర డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాట్ల కుమార్‌రాజు, జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, ఆయిల్ ట్యాంకర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, ఆర్.వి.ఆర్.ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీల ఆందోళన



ఆందోళన చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

బీచ్‌రోడ్డు: ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద హెల్త్ సెక్రటరీలు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రమోషన్లు కల్పించాలని, రీ–డిప్లాయ్‌మెంట్ రద్దు చేయాలని, జీవో ప్రకారం పనివేళలు, సెలవులు అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీలు పలుమార్లు డీఎంహెచ్‌వోకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతోనే ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. గత 25న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు ఫిర్యాదు చేసినప్పుడు.. వారం రోజుల్లో ప్రమోషన్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆందోళనకు స్పందించిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు వారిని చర్చలకు ఆహ్వానించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఒకేషనల్ ఏఎన్‌ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ల జెన్యూనిటీ వెరిఫికేషన్ మూడు రోజుల్లో పూర్తి చేసి, మరో రెండు రోజుల్లో ప్రమోషన్లు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హామీ ఇచ్చారు. అలాగే సచివాలయం హెల్త్ సెక్రటరీలకు రీ–డిప్లాయ్‌మెంట్ నుంచి మినహాయిస్తున్నట్లు తెలిపారు. ఆయన హామీ మేరకు హెల్త్ సెక్రటరీలు ఆందోళన విరమించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి చుక్కల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు పి. మణి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవకి, రత్నం పాల్గొన్నారు.

బాల్యం విద్యకు దూరం కాకుండా చూడాలి

ముగిసిన సీఆర్‌ఏ శిక్షణ



ఆచార్య అమృతవల్లిని సత్కరిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్, ఆచార్య షారోన్‌రాజు

మద్దిలపాలెం: ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యకు వెళ్లే క్రమంలో బడి మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని ఎన్‌సీటీఈ–ఆర్‌సీఐ ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యురాలు, ఆచార్యురాలు డాక్టర్ టి.జి.అమృతవల్లి పిలుపునిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఆర్‌ఈ శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమృతవల్లి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థులతో కలిసి చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు వారి అభ్యాసన స్థాయిని నిరంతరం గమనించాలని కోరారు. చదవడం, రాయడం, ప్రాథమిక గణిత అంశాలపై విద్యార్థులకు పట్టు ఉండేలా చూడాలని వివరించారు. ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ చిన్నారులందరికీ సమాన అవకాశాలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పాఠశాల విద్య విభాగం ఆర్జేడీ వి.విజయభాస్కర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం జాతీయ విద్యా విధానం రూపొందించబడిందని, మండలానికి ఒక ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేస్తే వారి అవసరాలకు అనుగుణంగా విద్య అందించవచ్చని తెలిపారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో దివ్యాంగులకు బోధించేటప్పుడు ఎదురైన సమస్యలను తెలియజేస్తే, వాటిని ఆర్‌సీఐ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు.

11న ఉక్కు ప్రైవేటీకరణపై బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ, సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచారం, 11న పాత గాజువాకలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఈఓఐ' (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) పేరుతో విశాఖ ఉక్కులోని 46 కీలక విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈఓఐ రద్దుపై ప్రకటన చేయకపోవడం దారుణమని విమర్శించారు. దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు పాదయాత్రలు, కరపత్రాల పంపిణీ, గేట్ మీటింగ్‌లు వంటి ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ పోరాటంలో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పీజీఆర్‌ఎస్‌కు 7 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 7 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతృప్తికరంగా సేవలు అందించా..



ఆచార్య ధనుంజయరావును సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా ఏడాది కాలం పాటు సేవలందించడం ఎంతో గర్వకారణమని, ఈ అవకాశం తనకు కల్పించిన వీసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు అన్నారు. రిజిస్ట్రార్‌గా రిలీవ్ అవుతున్న ఆయనకు అకడమిక్ సెనెట్ మందిరంలో సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ధనంజయరావు మాట్లాడుతూ ఏడాది కాలం రిజిస్ట్రార్ సంతృప్తికరమైన సేవలు అందించానని చెప్పారు. ఈ సమయంలో ఎంతో నేర్చుకున్నానని, ఎన్నో సవాళ్లతో కూడుకున్న బాధ్యతగా రిజిస్ట్రార్ పదవి నిలుస్తుందని చెప్పారు. ఏయూ వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ రిజిస్ట్రార్‌గా కొనసాగాలని ధనుంజయరావును తాను కోరానని... అయినా రిలీవ్ కావాలని భావించడంతో తప్పనిసరి పరిస్థితులలో వీడ్కోలు పలకాల్సి వస్తోందన్నారు. మంచి పరిపాలనదక్షుడిగా ధనుంజయరావు నిలుస్తారని కొనియాడాను. రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వెలకట్టలేని సేవలను ధనుంజయరావు అందించాలని కొనియాడారు. ధనుంజయరావును వీసీ రాజశేఖర్ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.